క్లుప్తంగా

ఆహారంతో సరైన ఆరోగ్యం



రోగులకు మందులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని బొక్కావారిపాలెంలో బెతెస్థ కృపా ప్రార్ధన మందిరంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంద్వారా ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని పౌష్టికాహారం ఔషధంగా పనిచేస్తుందన్నారు. అనంతరం రోగులకు మందులను అందించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ బి ప్రసాదుబాబు, సంఘ పెద్దలు కె ఏసురాజు, మణికంఠ, ఆర్ ప్రణీత ఏంజిల్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు



భీమవరంలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో హోటల్స్, బేకరీలు, స్వీట్ షాపుల్లో నిల్వపదార్థాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని, ఇక నుండి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. భీమవరం పట్టణంలో ఉండి రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్‌ను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెస్టారెంట్ లో ఉన్న పదార్థాల ప్యాకెట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కొన్ని హోటల్స్‌లో నిల్వ ఆహార పదార్థాలు వండి అమ్మడం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు తనిఖీలో భాగంగా రెస్టారెంట్‌లో మటన్ కర్రీ, చిల్లీ పౌడర్ శాంపుల్స్ తీయించారు. తీసిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపడం జరుగుతుందని, పరీక్షలలో కల్తీ అని తేలితే రిపోర్టులు ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి ఏ.ఎస్.ఆర్ రెడ్డి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన వ్యవసాయం వల్ల ఖర్చుల పెరుగుదల

మొగల్తూరు: రసాయన వ్యవసాయం చేయడం వలన పంటపై ఖర్చులు పెరగడమే కాకుండా భూసారం తగ్గుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎంఎం నూకరాజు తెలిపారు. మొగల్తూరు సచివాలయ పరిధిలోని పడమటిపాలెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రసాయనాలతో పండించిన కూరగాయలు తినడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. రసాయన వ్యవసాయం వల్ల రానున్న రోజుల్లో పంట భూమలు బీడు భూములుగా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పడమటిపాలెం, నక్కావారిపాలెం,కోట, కుక్కల వారితోట గ్రామ సంఘాలలోని రైతులు జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలి

మొగల్తూరు: మంచినీటి ట్యాంకులను తరుచుగా శుభ్రపరుచుకోవాలని ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మంచినీటి వనరులను, ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని కాళీపట్నం, కేపీ పాలెం, మొగల్తూరు ప్రాజెక్టుల వద్ద పంచాయతీ సిబ్బంది, ప్రాజెక్టు సిబ్బంది ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం తాగు నీరందించే మంచి నీటి ప్రాజెక్టుల్లోను, మన ఇళ్ల వద్ద నిర్మించుకున్న వాటర్ ట్యాంకులను తరుచుగా శుభ్రపరుచుకోవాలన్నారు. అంతేకాక ట్యాంకులు శుభ్రపరుచుకున్న తరువాత సూపర్ క్లోరినేషన్ చేయడంతో పాటు నీటిని పరీక్షించుకోవాలని పేర్కొన్నారు.

స్పష్టమైన ప్రణాళికతో చదవాలి

నరసాపురం: విద్యార్థులు స్పష్టమైన ప్రణాళికతో చదివి, ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తే విజయం సాధించవచ్చని నన్నయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ షేక్ సులేమాన్ సూచించారు. మంగళవారం వైఎన్ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ అనేది విద్యార్థి దశలో కీలకమైనదన్నారు. ఇంటర్ తరువాతే విద్యార్థి జీవితం చదువుపరంగా మలుపు తిరుగుతుందని చెప్పారు. క్రమశిక్షణ, దురలవాట్లు విషయంలో కూడా ఇంటర్ విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పిన్సిపాల్ సీహెచ్ కనకారావు, హెచ్‌ఆర్డీ సెంటర్ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సాంకేతిక విధానంతో రైతులకు మేలు



ఉండి: పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

ఉండి: మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడిస్తే రైతులు మంచి లాభాలు పొందుతారని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మహదేవపట్నం రైతుసేవా కేంద్రంలో గ్రామ సర్పంచ్ వనిమా వెంకట సుబ్బలక్ష్మీ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.నాగార్జున మాట్లాడుతూ ఈ-పంట కార్యక్రమంలో రైతులు పండించే పంటను నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లితే నష్ట పరిహారం పొందే అవకాశం రైతుకు ఉంటుందన్నారు. అలాగే 25 బుధవారం నిర్వహించే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులు విధిగా పాల్గొని ఎలుకలను నిర్మూలించాలని కోరారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎ.శ్రీనివాసరావు, రజిత మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైనట్టే చేపల చెరువు సాగుకు మట్టి పరీక్షలు అవసరమని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సుడిదోమ, ఆకు ముడత తెగుళ్ళు అధికంగా ఉన్న కారణంగా రైతులు నత్రజని ఎరువులు తగ్గించుకోవాలని సూచించారు. వెటర్నరీ డాక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు వనిమా శ్రీనివాస్, యర్రా విక్రమ్, శివర్మ, జి.వెంకటేశ్వరరాజు, వీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

పెదఅమిరంలో

కాళ్ల: మండలం పెదఅమిరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి జి.బాల నాగేశ్వరమ్మ, మండల వ్యవసాయాధికారి సి.జయవాసుకీ మాట్లాడుతూ వరిలో ఎండు, ఆకుముడత తెగుళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. దీంతో పాటు పైపాటుగా పొటాష్ ఎరువును ఎకరాకు 15 నుంచి 20 కేజీలు వేసుకోవాలన్నారు. ఆకు ఎండు తెగులు నివారణకు ప్లాంటమైసిన్ 100 గ్రాములు ఎకరాకు కోసైడ్ మందులను కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. 25 నిర్వహించే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని సూచించారు. అలాగే పశు సంవర్ధక శాఖ అధికారి జి.చంద్రబాబు మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా గేదెలను కొనుగోలు చేసేందుకు రుణాలు ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ఇరిగేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొండేపూడిలో

పాలకోడేరు: మండలంలోని కొండేపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి వి.నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పరిశోధన చేయగా స్వర్ణ రకం వరిలో దోమ ఉద్ధృతి ఎక్కువగా గమనించామన్నారు. సంపద స్వర్ణ రకంలో సుడిదోమ తక్కువగా ఉందన్నారు. దీనికి సంబంధించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మల్లిఖార్జునరావు, భీమవరం సహాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సింథటిక్ పైరత్రాయిడ్స్ ఐన లాంబ్రా సైహలొత్రిన్, బైపెంత్రిన్, ప్రొఫినోపాస్, వంటి పురుగు మందులు పిచికారీ చేయడమే దీనికి కారణమన్నారు. అందువల్ల వరి చేలల్లో సింథటిక్ పైరిత్రాయిడ్స్ ఉపయోగించరాదన్నారు. దీని నివారణకు ఎకరాకు 20 కిలోల ఎంవోపీ పైపాటుగా చల్లుకోవడం, కాపర్ హైడ్రాక్సైడ్ 53.8 శాతం, లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి పైరు అంతా తడిసేటట్లు పిచికారీ చేయలన్నారు. మండల పశువైద్యాధికారి టి.హేమ పశుగ్రాసాలు, వాటిలోని పోషణ విలువలు, వాటి ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

భీమవరం అర్బన్: వరిలో సస్య రక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాయలం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో పలువురు రైతులు లేవనెత్తిన సమస్యలకు వివిధ శాఖల అధికారులు పరిష్కారం చూపి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఉదయాన్నే పొలం చుట్టూ తిరిగితే పైరుపై ఆశించిన తెగులును గుర్తించి ఆదిలోనే నివారణ చర్యలు చేపట్టవచ్చాన్నారు. మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ సాగులో సమస్యలు పరిష్కారానికి, అధిక దిగుబడి సాధించడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోళ్ల అబ్బులు, మండల పశు వైద్యాధికారి మౌర్య, డ్రైయిన్ శాఖ ఏఈ ప్రకాష్, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ రాజు, ఎఫ్‌డీవో లావణ్య, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేలల్లోని ఎలుకలను సామూహికంగా మట్టుపెట్టాలి

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలు వరి దుబ్బులను కొరికి చేనును నాశనం చేస్తాయని వాటిని ఆయకట్టులోని రైతులందరూ సామూహికంగా మట్టుపెట్టాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం పట్టణంలోని గునుపూడిలో బుధవారం సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పంట చేలల్లో ఎలుకల బొరియలను మూసే కార్యక్రమం చేపట్టారు. గురువారం పంచాయతీలు వద్ద నూకలు, నూనె, బ్రోమోడయోలిన్ కలిపిన ఎలుకల మందును వ్యవసాయాధారిత రైతు భరోసా కేంద్రాలలో పంపిణీ చేస్తామన్నారు.



కాళ్ల: పెదఅమిరంలో ఎలుకల బొరియలను మూసేస్తున్న దృశ్యం



పాలకోడేరు: రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు



రాయలం గ్రామంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సేవాభావం అలవర్చుకోవాలి

ఆకివీడు: విద్యార్థి దశ నుంచి సేవాభావం అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి సేవాదృక్పథంతో పని చేయాలన్నారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ టి.ఓగేశ్వరరావు అధ్యక్షత వహించగా, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆనంద్ కుమార్, అనిల్ థాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

ఉండి: మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎంపిక చేసినట్లు నూతన అధ్యక్షుడు పాస్టర్ కొత్తపల్లి మెల్కిసెదెక్ తెలిపారు. ఉండి వాగ్దాన ప్రార్థనా మందిరంలో నిర్వహించిన సమావేశంలో కె.మార్టిన్, బి.జోసఫ్, జి.దానియేలు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేసినట్లు ఆయన పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడు కొత్తపల్లి మెల్కిసెదెక్, ఉపాధ్యక్షులు మాదాసి రవికుమార్, మాకా ఇమ్మానుయేలు, ట్రెజరర్ వైజే ప్రసాద్, జాయింట్ ట్రెజరర్ కె.ప్రసాద్‌పాల్ సభ్యులుగా బి.లాంజరు, కె.యోహాను, తదితరులు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యూటన్, బి.జార్జ్, బి.ప్రమీలాజార్జ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల బైఫరికేషన్‌తో డీలర్లకు ఇబ్బందులు

భీమవరం: రేషన్‌కార్డుల బైఫరికేషన్ ద్వారా రేషన్‌డీలర్స్ ఆదాయంకోల్పోయి జీవనోపాధికి ఇబ్బంది ఏర్పడుతుందని డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అధికారి వీరవెంకట సత్యనారాయణ, శిరం నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్‌షాపులకు గ్రామీణప్రాంతాల్లో 650, పట్టణ ప్రాంతాల్లో 900 కార్డులు కేటాయించాలని, అలాగే కొన్ని షాపుల్లో ఎక్కువ కార్డులు, మరికొన్ని షాపుల్లో తక్కువ కార్డులున్నందున వాటిని సవరించాలని కోరారు. రేషన్ సరుకులు ఎంఎల్ఎస్ పాయింట్స్ వద్ద అన్ని ఒకేసారి ఇవ్వాలని ప్రకటనలో కోరారు.

బెదిరింపుల కేసు నమోదు

ఉండి: ఓ వ్యక్తిని చంపుతామని బెదిరింపులకు దిగిన కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన దంతులూరి రామకృష్ణంరాజు మరి కొందరు ఆస్థి తగాదా విషయమై తనతో గొడవపడుతున్నారని, చంపుతానని బెదిరిస్తున్నారని ఉండి మండలం చెరుకువాడకు చెందిన కొండవేటి నాగ వెంకట సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మంగళవారం ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గృహ నిర్బంధాలతో దళిత ఉద్యమాన్ని ఆపలేరు



భీమవరంలో దళిత జేఏసీ నాయకులు సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న దృశ్యం

భీమవరం: గృహనిర్బంధాల ద్వారా దళిత ఉద్యమాన్ని ఆపలేరని పలువురు అన్నారు. మంగళవారం పట్టణంలోని బహుజన జేఏసీ కార్యాలయంలో తాళ్ళూరి మధు అధ్యక్షతన జరిగిన దళితనాయకుల సమావేశంలో దళిత జేఏసీ నాయకులు గంటా సుందరకుమార్, గుమ్మాపు సూర్యవరప్రసాద్, కోనా జోసఫ్ మాట్లాడుతూ కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు కారణంగా ఏర్పడిన ఫ్లెక్సీ వివాదంపై దళిత సంఘాలు ఛలో భీమవరం కార్యక్రమానికి పిలుపునిస్తే జిల్లా వ్యాప్తంగా దళితనాయకులను గృహనిర్బంధాలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి గృహనిర్బంధాలు ద్వారా దళిత ఉద్యమాన్ని అపేదిలేదని హెచ్చరించారు. ఏలూరుపాడు ఘటనపై భవిష్యత్ కార్యక్రమం రూపొందించడానికి ఈ నెల 27న పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో జిల్లా ముఖ్యనాయకుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోడదాసి శ్రీధర్, బడుగు అశోక్‌కుమార్, చవ్వాకుల భరత్, బిరుదుగడ్డ రమేష్‌బాబు, ఇంజేటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నష్టాలపై అవగాహన



భీమవరంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్‌ను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పిఓ ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి, అడిషనల్ ఎస్పీ వి భీమారావు, ఎన్‌టీసీ పి బాలా, డిఇ ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఉండి: నియోజక వర్గ స్థాయిలో పాలకోడేరు మండలం మోగల్లులో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన 16 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎంవీ సత్యనారాయణ పత్రికా ప్రకటనలో మంగళవారం తెలిపారు. సోమవారం మోగల్లులో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు అండర్-14, 17 స్థాయిలో వివిధ విభాగాల్లో 14 పతకాలు సాధించినట్లు తెలిపారు. ఏలూరులో జరగబోయే జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనడం చాలా గర్వంగా ఉందన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు వీరే:

అండర్- 14, 17 విభాగంలో బి.యోగినాయక్, ఎం.హారిక, పి. సురేఖ, మేరీ సుష్మ, పి.చంద్రశేఖర్ నాయుడు, ఎం.శ్యామ్‌కుమార్, కె.మహేష్ పలు విభాగాల్లో పతకాలు సాధించారు. అలాగే పాఠశాల నుంచి అండర్-14 విభాగంలో ఇద్దరు బాలికలు, ముగ్గురు బాలురు, అండర్-17 విభాగంలో ఆరుగురు బాలికలు, ఐదుగురు బాలురు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాసరావును అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు

సాగులో ఆధునిక యంత్రాలు వినియోగించాలి



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్రాలను వినియోగించి సాగు చేపట్టాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కఠారి జయలక్ష్మి సూచించారు. మండలంలోని అజ్జమూరు, మాదివాడ గ్రామాల్లో డ్రోన్ వినియోగంపై మంగళవారం వ్యవసాయశాఖ రైతులకు సూచనలు, సలహాల కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వరదలకు ఖరీఫ్ పంట పూర్తిగా నాశనమయ్యిందన్నారు. రబీ సాగుకు ఆధునిక యంత్రాల వినియోగాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంట ఉన్న ప్రాంతంలో రైతులు మందుల పిచికారీకి డ్రోన్లను వినియోగించాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక మాట్లాడుతూ ఎలుకల నిర్మూలనకు రైతులు సమిష్టిగా కృషి చేయలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నిర్మూలన మందును అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కుప్పనపూడిలో చికున్ గున్యా లక్షణాలు



జ్వర పీడితుడు కట్రెడ్డి ఏడుకొండలు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలో వైరల్ ఫీవర్లు పెరుగుతున్నాయి. దీంతో పాటు చికున్ గున్యా లక్షణాలు కన్పిస్తున్నాయని బాధితులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో జ్వర పీడితులు ప్రైవేట్ ఆసుపత్రులల్లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

జ్వరాలతో ముగ్గురే ఉన్నారంట..!

మండలంలో జ్వరాలతో ముగ్గురే ఉన్నారని పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రమేష్ మంగళవారం వివరణ ఇచ్చారు. విజృంభిస్తున్న జ్వరాలు అనే శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. సెప్టెంబర్‌లో ఇంత వరకూ 34 జ్వరపీడిత కేసులు నమోదు అయినట్లు తెలిపారు. జ్వరాల తీవ్రత తక్కువగా ఉందన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాల కేసులను నమోదు చేస్తున్నారని తెలిపారు. ప్రతీ రోజూ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు, స్పెషలిస్టు డాక్టర్లు హాజరవుతున్నారన్నారు. గత నెలలో జిల్లా ఆసుపత్రి నుంచి పేథాలజిస్టు వచ్చి కొందరి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపగా, చికున్ గున్యా లక్షణాలున్నట్లు నిర్ధారణ అయిందన్నారు. వారికి వైద్యం అందించామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో జ్వరపీడితులు క్యూ కట్టి వైద్యం చేయించుకుంటుంటే, జ్వరాలు లేవని, కేవలం మండలంలో ముగ్గురే జ్వరంతో ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉంది. రెండు వారాల పసికందుకు చికెన్ గున్యా వచ్చింది. బీజేపీ మండల అధ్యక్షుడు కట్రెడ్డి ఏడుకొండలుకు చికెన్ గున్యా లక్షణాలు కన్పిస్తున్నాయని, ఐదు రోజుల నుంచి జ్వరంతో, విపరీతమైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు వివరించారు. ఇవే లక్షణాలతో కొంతమంది ఉన్నట్లు ఆయా గ్రామల ప్రజలు చెబుతున్నారు. ఇంటింటికీ వెళ్లి సిబ్బంది సర్వే చేస్తే జ్వరపీడితులు కన్పించక పోవడం దారుణమైన విషయం.

ఆక్రమణల తొలగింపు ఆపాలని వినతి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: ఆక్రమణలను ఖాళీ చేసేందుకు ఆరు నెలల గడువు ఇవ్వాలని మండలంలోని అయిభీమవరం రోడ్డులోని ఆక్రమణదారులు మొర పెట్టుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, వృద్ధులు మాట్లాడుతూ మూడు తరాల నుంచి ఇక్కడే జీవిస్తున్నామన్నారు. వృద్ధులు అధికంగా ఉండటం వలన ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకుల తప్పిదానికి తాము రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేసిన తరువాత మేము ఇళ్లు ఖాళీ చేస్తామని వారు తెలిపారు. బాధితులకు అండగా సీపీఎం నాయకులు ఉన్నారు. అనంతరం డీటీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు.

దేవీ నవరాత్రుల్లో విశిష్ట పూజలు

యలమంచిలి: గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వారి ఆలయంలో దసర శరన్నవరాత్రులు సందర్భంగా అక్టోబర్ 3వ తేదీ నుంచి 13 వరకు తొమ్మిది రోజులు సాయంత్రం విశిష్ట పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నామాల సతీష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజులు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు పూజ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పూజలో పాల్గొనే భక్తులు పూజా సామగ్రి ఎవరికి వారి తెచ్చుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: గ్రామాల్ని అభివృద్ధి పర్చడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండి యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పలువురు వక్తలన్నారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవలో ముందంజ వేసి నాయకులుగా ఎదగాలన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు,పేద విద్యార్థినులకు ఉచిత యూనిఫామ్స్ అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ తరపున అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీజేకే ప్రసూన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ పి.అరవింద్ స్వామి, ఆరేటి ప్రకాష్, వడపు గోపి, ఎంవీ రామభద్రరాజు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో

భీమవరం: ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ సమ సమాజ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్ల నాటడం, ప్లాస్టిక్ నివారణ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చెట్లు నాటడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించటం చేపట్టారు. అనంతరం బెస్ట్ వలంటీర్స్‌కు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ చైతన్య, సహాయ కోఆర్డినేటర్ కెఎన్‌వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దొంగ బంగారం కొనుగోలుపై ఆరా

ఆకివీడు: స్థానిక ప్రధాన సెంటర్‌లో ఒక జ్యూవెలరీ షాప్ యజమాని దొంగ బంగారం కొనుగోలు చేశారని ఆరోపణపై మంగళవారం భీమవరం పోలీసులు విచారణ చేశారు. దొంగతనం చేసిన బంగారం ఇదే షాపులో అమ్మానని ఒక వ్యక్తి చెప్పడంతో పోలీసులు షాప్ యజమానిని అదుపులోకి తీసుకున్నారు. దొంగిలించిన బంగారం 12 కాసులని ఆ వ్యక్తి చెబుతుంటే షాపు యజమాని కాసున్నర మాత్రమే కొనుగోలు చేశానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేసేందు షాప్ యజమానిని భీమవరం తీసుకెళుతున్నట్లు తెలిసింది.